بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 30 January 2026 (Telugu)

## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు గల దైవ ప్రేమ గురించి విశ్వాసభరిత ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 30.01.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ۔ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ
نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లంనకు గల దైవప్రేమ గురించి లెక్కలేనన్ని సంఘటనలు ఉన్నాయి. వాస్తవానికి వారి సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతి చర్య మరియు ప్రతి సంఘటన వారు సల్లల్లాహు అలైహి వసల్లం హృదయంలో దైవ ప్రేమ సముద్రం ఎప్పుడూ అలలు వేస్తుంటుందని తెలియ జేస్తుంది. దీనికొక ఉదాహరణ గజ్వా-ఎ-ఉహుద్ (ఉహుద్ యుద్ధం)లో కనిపిస్తుంది, అక్కడ దైవ ప్రేమలో వారి తపన యొక్క విలక్షణమైన, సాటిలేని శైలి కనిపిస్తుంది.

హజ్రత్ బరా రజియల్లాహు అన్హు కథనం ప్రకారం ఉహుద్ రోజున మేము బహుదైవారాధకులను ఎదుర్కొన్నాము. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం విల్లుకారుల బృందాన్ని నియమించి, హజ్రత్ అబ్దుల్లా రజియల్లాహు అన్హును వారి నాయకుడిగా నియమించారు. మేము వారిపై విజయం సాధించినా మీరు మీ స్థానాన్ని వదలకండి, ఒకవేళ వారు మాపై విజయం సాధించినా మా సహాయానికి రావద్దు అని ఆదేశించారు. అంటే గెలుపు ఓటములు ఏవైనా మీరు మాత్రం తమ స్థానాన్ని వదలకూడదు. యుద్ధం ప్రారంభమైనప్పుడు శత్రువులు పారిపోయారు, అన్యారాధకుల స్త్రీలు కూడా కొండల వైపు పారిపోవడం నేను చూశాను. ముస్లింలు 'యుద్ధ సంపద' అని అరవడం మొదలుపెట్టారు. హజ్రత్ అబ్దుల్లా రజియల్లాహు అన్హు వారిని హెచ్చరించినా, ముస్లింలు ఆ కనుమను వదిలి వెళ్లడంతో అల్లాహ్ వారి నుండి ముఖం తిప్పుకున్నాడు. యుద్ధం మలుపు తిరిగింది, శత్రువులు తిరిగి ముస్లింలపై దాడి చేశారు. ఫలితంగా 70 మంది ముస్లింలు అమరులయ్యారు. కథకుడు ఇట్లు ఉల్లేఖించాడు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ సహచరులను వెంటబెట్టుకొని పర్వతం మాటున ఆశ్రయం పొందిరు. సరిగ్గా అప్పుడే అబూ సుఫ్యాన్ ఒక ఎత్తైన ప్రదేశానికి చేరుకొని మీలో ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉన్నారా?" అని అరిచాడు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సమాధానం ఇవ్వకండి అని అన్నారు. అతడు మరల ఇట్లనెను. మీలో అబీ ఖహాఫా కుమారుడు (అబూబక్ర్ రజి) ఉన్నాడా?

సమాధానం ఇవ్వకండని వారు సల్లల్లాహు అలైహి వసల్లం హితవు పలికారు. ఎలాంటి సమాధానం రానందున మీలో ఉమర్ బిన్ ఖత్తాబ్ ఉన్నాడా? అని అతడు అరిచాడు. ఎలాంటి సమాధానం రానందున అబూసుఫ్యాన్ ఇట్లనెను. వీరంతా చనిపోయారు. జీవించి ఉన్నచో వీరు తప్పక సమాధానం ఇచ్చేవారు. అప్పుడు హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు తమను తాము ఆపుకోలేక గట్టిగా ఇట్లు అరిచారు. "ఓ అల్లాహ్ శత్రువా! నువ్వు అబద్ధం చెబుతున్నావు నిన్ను అవమానించే వారిని అల్లాహ్ ఇప్పటికీ సజీవంగానే ఉంచాడు. అబూ సుఫ్యాన్ ఇట్లు నినాదం చేసెను. 'హుబల్' (విగ్రహం) గొప్పదనం పెరుగుగాక! అతడు ఇట్లు అరిచినప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తట్టుకోలేక దానికి సమాధానం ఇవ్వమన్నారు. మేము ఏ సమాధానం ఇవ్వాలని అనుచరులు (రజి) అడిగారు. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. చెప్పండి. అల్లాహ్ అత్యున్నతుడు మరియు గొప్పవాడు. అబూసుఫ్యాన్ ఇట్లనెను. మా కొరకు ఉజ్జా ఉన్నది. మీ కొరకు ఏ ఉజ్జా లేదు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అతనికి సమాధానం ఇట్లు ఇవ్వండి. అల్లాహ్ మా సహాయకుడు, మీకు ఎవరూ సహాయకులు లేరు.

హుజూరె అన్వర్ ఇట్లు ఉపదేశించారు. దైవప్రేమలో బహుదైవారాధన వాసన కూడా రాకూడదని, ప్రజలు సమాధులను ఆరాధనా స్థలాలుగా మార్చుకుంటారేమోనని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆందోళన చెందేవారు. దురదృష్టవశాత్తూ నేడు ముస్లింలు దీనికి భిన్నంగా ఆచరిస్తున్నారు. ముస్లింలు సన్యాసుల, సత్యమూర్తుల సమాధుల వద్దకు వెళ్లి మొక్కుతున్నారు, సాష్టాంగాలు చేస్తున్నారు.

హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఇట్లు ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తాము పరమపదించిన అనారోగ్యంలో అనగా తమ చివరి క్షణాల్లో యూదులు మరియు క్రైస్తవులపై అల్లాహ్ శాపం పడుగాక, వారు తమ ప్రవక్తల సమాధులను మసీదులుగా మార్చుకున్నారు అని హెచ్చరించారు. ఇంకా హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఇట్లనిరి. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఆదేశించని యెడల వారి సమాధి బహిరంగ ప్రదేశంలో ఉంచబడేది. లేనిచో దానిని మస్జిద్‌గా చేసుకుంటారేమోనని నాకు భయాందోళన కలిగేది. అందుకే వారి సమాధిని బహిరంగ ప్రదేశంలో ఉంచలేదు. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ప్రస్తుతం అక్కడి ప్రభుత్వం దాని చుట్టు చాలా మంచి ఏర్పాట్లు చేసింది. ఎలాంటి అన్యారాధన బహిర్గతం కాకూడదని అక్కడ రక్షణ కంచెలు, గోడలు ఉన్నాయి. కనీసం ఈ మంచి పనైనా వారు చేశారు.

ఇంకా హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ ఇబ్న్ అబీ కాబ్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. అన్యారాధకులు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇట్లనిరి. నీ దేవుని వంశం ఏమిటో మాకు చెప్పండి. అప్పుడు అల్లాహ్ తఆలా ఇట్లు అవతరింపజేసెను. قُلْ هُوَ اللّٰهُ اَحَدٌ ۚ اَللّٰهُ الصَّمَدُ అనగా అల్లాహ్ ఒక్కడే, అల్లాహ్ అందరి అవసరాలను తీర్చువాడు. అతడు ఎవరినీ కనలేదు, అతడు ఎవరికీ పుట్టలేదు. పుట్టిన ప్రతిది తప్పక మరణించును. మరణించిన ప్రతి దానికి వారసత్వం ఉండును. కానీ మహోన్నతుడైన అల్లాహ్ మరణించడు. కనుక అతనికి ఎవడు వారసుడుండడు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. హుదైబియా ప్రాంతంలో రాత్రి వర్షం కురిసిన తర్వాత ఉదయం మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మాకు నమాజ్ చేయించారు. నమాజ్ చదివించిన తర్వాత వారు సల్లల్లాహు అలైహి వసల్లం మా వైపు తిరిగి ఇట్లు ఉపదేశించారు. వైభవోపేతుడైన మీ అల్లాహ్ ఏమి ఆదేశించాడో మీకు తెలుసా? అల్లాహ్ అతని ప్రవక్తకే మంచిగా తెలుసని ప్రజలు వేడుకొనిరి. వారు సల్లం ఇట్లనిరి. అల్లాహ్ ఇట్లు ఆదేశిస్తున్నాడు. నా దాసులలోని కొందరు ఉదయం నిద్ర లేచినప్పుడు వారిలో కొందరు నన్ను విశ్వసించేవారుండగా మరికొందరు నిరాకరించే వారుండిరి. అనగా ప్రజలలోని కొందరు రాత్రి వర్షాన్ని చూసి ఉదయం ఎలా నిద్ర లేచినారనగా వారిలోని కొందరు విశ్వసించేవారుండిరి మరికొందరు నిరాకరించే వారుండిరి. అల్లాహ్ అనుగ్రహం, అతని కరుణ వలన వర్షం కురిసిందని చెప్పిన వారు నన్ను విశ్వసించేవారు. కానీ నక్షత్రాల వల్ల వర్షం పడిందని చెప్పినవారు నిరాకరించేవారిగా మారారు.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఇట్లనిరి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను చూడండి! ఎంతటి దైవ జ్ఞానం కలిగి ఉండిరి, ఎంతగా జాగ్రత్త వహించేవారో, ఎలా దేవునితో భయపడేవారో, సమస్త మానవుల కంటే ఎక్కువ సంపూర్ణులు అయినను, అన్ని రకాల తప్పుల నుండి పవిత్రులైనను ఈ పవిత్రత, దైవభీతి స్థితి ఎట్లుండెననగా అనుక్షణం అల్లాహ్ తఆలాతో భయపడేవారు. పుణ్యం తర్వాత మరో పుణ్యం చేసేవారు. ఉత్తమోత్తమ సత్కార్యాలు అవచరించేవారు. ఒక పుణ్యం చేసిన తర్వాత మరో పుణ్యం చేసేవారు. చెడు అనే ఆలోచనే తలెత్తేది కాదు, అనుమానం కూడా ఉండేది కాదు. అనుక్షణం దైవ ఆరాధనలో నిమగ్నమై ఉండేవారు. భయపడేవారు, చాలా భయపడేవారు. అయినను సాధ్యమైనంత వరకు తన తరపున జాగ్రత్త వహించేవారు. కానీ దేవుని వైభవాన్ని చూసినప్పుడు స్వయంభువు అయిన దేవుని ఆస్థానంలో తమ కర్మలన్నిటిని విస్మరించేవారు, పశ్చాత్తాపం వ్యక్తపరిచేవారు, సందర్భంను బట్టి క్షమాపణ యాచించేవారు. దైవ ప్రేమ పరిస్థితి ఎలా ఉండెననగా అనుక్షణం పవిత్ర నాలుక దైవస్మరణతో తడుస్తూ ఉండేది.

హజ్రత్ సమ్‌ర్‌హ్ బిన్ జందబ్ ఇట్లు ఉల్లేఖించారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించారు. నాలుగు విషయాలు అన్ని శాసనాల కంటే గొప్పవి. దేనితో నువ్వు ప్రారంభించినా నీకు నష్టం లేదు. వీటితో ప్రారంభించినచో అన్నిటికంటే ఉత్తమమైనది, చాలా శుభం గల విషయాలు. అవేమిటి? ఒకటి: సుబ్‌హానల్లాహ్. రెండవది: అల్‌హందులిల్లాహ్. మూడవది: లాఇలాహ ఇల్లల్లాహ్, నాలుగవది: అల్లాహు అక్బర్. అనగా అల్లాహ్ పవిత్రుడు. కావున ఈ విషయాలను సదా గుర్తుంచుకోండి లేదా పని చేస్తున్నప్పుడు ఈ విషయాలను గుర్తుంచుకొన్నచో వీటిలో శుభం కలుగును.

హజ్రత్ అబూ బక్ర ఇట్లు ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఏదేని ఆనందం కలిగించు విషయం తెలిసినప్పుడు వారు సల్లల్లాహు అలైహి వసల్లం తక్షణమే అల్లాహ్‌కు కృతజ్ఞత తెలుపుటకు సాష్టాంగం లో పడిపోయేవారు.

హజ్రత్ మఆజ్ బిన్ జబల్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అల్లాహ్ శిక్ష నుండి మోక్షం కలిగించుటకు అల్లాహ్ తఆలా స్మరణ కంటే గొప్ప విషయం మరొకటి లేదు.

మరో చోట హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఇట్లు ఉల్లేఖించారు. అల్లాహ్ కరుణలలోని ఒక కరుణ నాపై గలదేమనగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించినప్పుడు నా గృహంలో, నా వంతు రోజున, నా ఛాతి, నా కడుపు మధ్యలో తల పెట్టి పరమపదించారు. వారు సల్లల్లాహు అలైహి వసల్లం తుది శ్వాస తీసుకున్నప్పుడు నా ఉమ్మితో వారి ఉమ్మును అల్లాహ్ కలిపినాడు. అదెలాగనగా అబ్దుర్రహ్మాన్ నా వద్దకు వచ్చినప్పుడు వారి చేతిలో ఒక పండ్ల పుల్ల ఉండెను. అప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నాపై వంగి పడుకొనిరి. వారు ఆ పండ్ల పుల్ల వైపు చూస్తుండిరి. వారికి పండ్ల పుల్ల చాలా ఇష్టమని నాకు తెలుసి ఎండెను. అందుకే దానిని మీ కొరకు నేను తీసుకోనా? అని వేడుకొంటిని. వారు తల ఊపుతు అవునని సంజ్ఞ చేసిరి. దానిని నేను వారికి ఇవ్వగా అది గట్టిగా అనిపించినది. నేను మీ కొరకు దానిని మెత్తగా చేయనా? అని వేడుకొన్నాను. అవునని వారు తల ఊపుతూ సంజ్ఞ చేశారు. వారి సల్లల్లాహు అలైహి వసల్లం దగ్గర నీళ్ల పాత్ర ఉండెను. వారు తన చేతిని ఆ నీళ్లలలో తడుపుతూ వాటిని తమ పవిత్ర ముఖంపై రుద్దుకొంటూ ఇట్లనేవారు. లాఇలాహ ఇల్లల్లాహ్ అనగా అల్లాహ్ తప్ప మరెవ్వరు ఆరాధనకు అర్హులు లేరు. నిస్సందేహంగా మృత్యువు కష్టాలు, వేదనలు ఉంటాయి. అనంతరం వారు సల్లల్లాహు అలైహి వసల్లం తమ చేతిని పైకి లేపుతూ ఇట్లనిరి. అర్రఫీఖుల్ ఆలా అనగా ఉన్నత స్నేహితుడు అల్లాహ్. ఇంతలోనే వారు సల్లల్లాహు అలైహి వసల్లం తుది శ్వాస విడిచినారు. అప్పుడు వెంటనే చెయ్యి క్రింద పడింది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు ఉపదేశించారు. చివరి సమయంలో అల్లాహ్ తఆలా వారి సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఇట్లు స్వేచ్ఛ కల్పించాడు. నువ్వు కోరిచనో ప్రపంచంలో ఉండవచ్చును లేదా నా వద్దకు రావచ్చును. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు వేడుకొనిరి. ఓ నా పోషకుడైన అల్లాహ్! నీ వద్దకు రావాలనే నేను కోరుకుంటున్నాను. చివరి క్షణంలో వారు పవిత్ర ప్రాణం విడిచినప్పుడు వారి నోట ఈ వాక్యం ఉండెను. బిర్రఫీఖిల్ ఆలా అనగా ఇక నేను ఇక్కడ ఉండదలచుకోలేదు. నేను నా దేవుని వద్దకే వెళ్ళాలని ఆశిస్తునన్నాను.

**అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వబారిక్ వసల్లిమ్ ఇన్నక హమీదుమ్మజీద్**

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ
اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ
وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ
وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -